# టర్నింగ్‌పాయింట్ !

మల్లేశం సప్లైయరు ! హెూటల్ సప్లైయరుకాదు ! టెంట్‌హౌస్ సప్లైయర్ అంతకంటే కాదు!.

అతనికో రేంజ్ వుంది! స్టేటస్ వుంది. విల్లావుంది? కారుంది అందమైన వైఫుంది?

ఈ లెవెల్‌కి రాకముందు పల్లెలో వుండే రోజుల్లో మల్లేశం పెళ్లాం వీధులవెంట తిరుగుతూ పశువులు వేసే పేడ ఓ [illegible] తట్టలోకెత్తుకుని ఇంటికి తీసుకొచ్చి వూకతో పేడను పిసికి వుండలుగా తయారు చేసి గోడకు పిడకలు కొట్టేది లచ్చిమి!

ఎండిన పిడకలను గ్రామమంతా తిరిగి అమ్ముకురావటం మల్లేశం డ్యూటీ! అమ్మగా వచ్చిన ఆదాయంతోటే వారి జీవనం. పల్లల్లేరనే దిగుల్లేదు.

లచ్చిమి అసలు పేరు లక్ష్మి టెన్త్ పాసైంది. మల్లేశం సైకిలుమీద ఊరంతా తిరిగి పూలమ్ముతుండేవాడు. చదువు పెద్దగాలేదు. థర్డ్‌ఫారం డింకీ కొట్టి చదవనని మొండికేసి రకరకాల పన్లు చేస్తూ చివరికి పూలు అమ్మంలో స్థిరపడ్డాడు.

ఇద్దరూ లవ్‌లో పడ్డారు! మల్లేశం మాటకారి. మాటలతో బోల్తా కొటించే తెలివుంది. వ్యాపారానికైతే పెట్టుబడి కావాలి... ప్రేమించటం పైసా ఖర్చులేని పని!

ఈరోజుల్లో మగ... ఆడ... అందంగ లేకున్నా.... పొట్టపొడిస్తే అక్షరంముక్క లేకున్నా... దోమల్లా వాలిపోతున్నారు. ఎలా బ్రతకటం అనే ఆలోచన ప్రేమికులకు రాదు. కులాలు... మతాలు అడ్డం రావు కనుక ఎవరు ఎకరినైనా ప్రేమించేయటమే!!. ముఖ్యంగ నేటి ముపతకిదో పెద్ద వ్యాపకం!

ప్రేమజంట ఎగిరిపోయి టౌనుకు దగ్గర్లో వున్న పల్లెటూళ్లో సెటిలైనారు. కన్నవారికి ఏకైక సంతానం... బంగారుపట్టి కావటాన... ఎగిరొస్తూ పుష్కలంగ డబ్బు... వంటిన నగలతో ప్రేమికుడితో జంపై పల్లెకిచ్చింది లక్ష్మి.

పల్లెలో ఓ వంద గజాల స్థలం కొన్నారు. గుడిసెవేసుకున్నారు. తిండికి కావలసిన సరంజామా అంతా కొనేశారు. హాయిగా గడిపేస్తున్నారు. వంటినున్న బంగారపు నగలను మట్టిముంతలో దాచి దాని మూతికి గుడ్డ చుట్టి ఎవ్వరికీ తెలియకూడదని దొడ్లో

గొయ్యితీసి అందులో వుంచి మట్టికప్పారు.

కొత్త ప్రేమికులు పల్లెలో చిలక గోరింకల్లా ఖుషీగ... కులాసాగ బ్రతికేస్తున్నారు. ఏడాది తిరిగేసరికి తెచ్చుకున్న డబ్బు హారతికర్పూరంటా హరించిపోయింది.

ఏం చేయటానికీ తోచక.. నగలు అమ్మటానికి మనస్కరించక... చివరికి పిడకల వ్యాపారంలోకి దిగారు. మొదట్లో ఈ పని నానుర్దా అన్పించినా పల్లెలో నమనెరిగిన వారెవరూ లేనందున అలవాటుపడ్డారు.

XXX

'ఛీ! ఎదవబతుకు... ఎన్నాళ్లిట్లా? మనం సిటీకెళ్దాం. లచ్చిమితో బువ్వతింటూ మనసులో మాట వెళ్లబెట్టాడు మల్లేశం.

'నాకూ అట్లాగే అన్పిస్తోంది. ప్రేమించుకోవటమంటే సినీమాల్లో లాగ పార్కులో డ్యూయెట్లు పాడుకోవటం... హాయిగ మెత్తని పరుపుల మీద దొర్లటం అనుకున్నాను!... ఇప్పుడు చూడు మనకష్టాలు... నా మీద నాకే అసహ్యమేస్తోంది' అంది లక్ష్మి వురఫ్ లచ్చిమి.

'అయితే ఇంకే? మకాం మార్చేద్దాం! గుడిసె అమ్మకానికి పెడ్తా! దాచుకున్న నగలతో హైదరాబాద్ వెళ్లి దర్జాగ బతికేయచ్చు!. దేశం నలుమూలలనుండి ఎందరెందరో ఆడికొచ్చి హాయిగ వుంటున్నారంట... పైగా నువ్వేమో అందంగ వున్నావాయె. ఏ సినీమా డైరెక్టర్ కంట్లోనైనా నలుసుగ పడితే మన భవిష్యత్తే మారిపోతుంది...'

'సరేలే!... అట్లాగే చేద్దాం...' లక్ష్మి తన అంగీకారం తెల్పటంతో నూతనోత్సాహం తొంగి చూచింది.

రైలెక్కి హైదరాబాద్ చేరుకున్నారు.

బంజారాహిల్స్ ఏరియాలో కబ్జాకు గురైన స్థలంలోవున్న గుడిసెల్లో ఒకదాన్ని కిరాయికి తీసుకుని సిటీలో సంసారం సాగించారు.

'నువ్వు సినీమా ఛాన్స్‌లకోసం ట్రైచేస్తావా?... నన్నేదైనా వుద్యోగం వెతుక్కోమంటావా?-' పెళ్లాం కళ్లల్లోకి మత్తుగ చూస్తూ సూటిగ ప్రశ్నించాడు.

'ఇదిగో... కలలు కనరకు... మట్టి తట్టలు మొయ్యకుండా వుండగలిగితే

అదేపదివేలు...' కళ్లు తిప్పుతూ జవాబిచ్చింది లక్ష్మి.

మొన్నొక కోయదొర నా చెయ్యి చూసి నాది బెమ్మాండమైన జాతకమని చెప్పాడు తెలుసా?- అదచేతిలో రేకలు అట్టావున్నాయే...' తనూ నవ్వాడు. ఆ నవ్వులో రాజసం గర్వం వుట్టిపడ్డయ్.

'ఓయబ్బ సంబరమో... లాటరీ వస్తుందేమో... టిక్కెట్లు కొంటూవుండు. కాపురం మేడలోకి మార్చేద్దాం...' ఎకసెక్కెంగ మాట్లాడింది.

'పో! నీకంతా పరాచికాలే! - నా కల నిజమైతే... అప్పుడు తెలుస్తది నేనంటే ఏమిటో...?-'

'నీకు అదృష్టం కలిసొస్తే... నన్నువొదిలేస్తావా నా సంగతి నీకింకా తెలీదు. అలాంటి పిచ్చి వేషాలేస్తే గరిటె కాల్చి వాతపెడతా... జాగర్త...' గుడ్లురిమింది.

'నీవన్నీ ఇంకా పిడకల ఆలోచన్లే!. మనం ఇప్పుడు సిటీలో వుంటున్నామే!- ఏ మూలనుంచైనా లక్ కలిసిరావచ్చు...'

పల్లీలు తింటూ ఇద్దరూ కబుర్లలో పడ్డారు!

X X X

మల్లేశానికి పనీపాట లేకుండా సోమరిలా తిని తిరగటం బొత్తిగ నచ్చలేదు. ఏ ఆటో అయినా నడపటానికి తనకు డ్రైవింగ్ రాదాయె!... సిటీలో పూలమ్మటానికి మనస్కరించటంలేదు. రిక్షా తొక్కాలన్నా... సిటీలో అవి కన్పించవు.

మట్టితట్టలు మోయలేడు. ఏదైనా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ వుద్యోగం చేద్దామన్నా తన పర్సనాలిటీ ఆ పనికి పనికిరాదు! పైగా... ఇప్పుడన్నిచోట్లా సెక్యూరిటీల నియామకం 'హవా' నడుస్తోంది.

ఇవేమీ కాకుండా.. జేబులు కొట్టటం... స్త్రీల మెడలో చైన్ స్నాచింగ్ విద్యారాకపోయినా... ప్రయత్నించి చూస్తేనో?- ఉహు! లాభంలేదన్పించింది.

ఇవేమీ కాకుండా... దొంగతనాలు చేసో.... పిల్లలను కిడ్నాప్ చేసి బెదిరించి లక్షలు... కోట్లు సంపాదించవచ్చన్పించింది.! అంతలోనే మల్లేశుని భయం ఆవహించింది. వళ్లంతా ముచ్చెమటలు పట్టినయ్. అమ్మో!... పట్టుబడితే పోలీసులు నంజుకుతింటారు. జైలు శిక్ష తప్పదు.

ఎన్ని విధాలుగ ఆలోచించినా నాలుగు డబ్బులు గౌరవప్రదంగా ఆర్జించగల మార్గం కన్పించక బుర్రగోక్కున్నాడు. తప్పొడు పస్తలకు పాల్పడితే లచ్చిమి అసలు వప్పుకోకపోగా... తనకు దూరమౌతుంది. ఆ బాధ భరించలేడు... దూరం చేసుకోలేడు. లచ్చిమిని ప్రేమించి మనువాడాడు!. ఆమెకోసం ఎన్నో త్యాగాలు చేశాడు. ఇష్టలేంకపోయినా కష్టాలు అనుభవిస్తున్నాడు తను. దాని మనసు నొప్పించలేడు. పెళ్లాన్ని బాధపెట్టలేడు.

మరేం చేసి సంపాదించాలి అనే ప్రశ్న మల్లేశుని వేధించసాగింది.

సిటీ అంతా పిచ్చోడిలా తిరిగి గుడిసె చేరుకున్నాడు. గుడిసె తాళం పెట్టి వుండటం చూచి 'ఇదెక్కడికెళ్లి వుంటుందబ్బా తనకు చెప్పకుండా...' అని గొణుక్కున్నాడు. బహుశ ఏ కారాణాకొట్టుకో వెళ్లివుంటుంది.... వచ్చేస్తుందిలే'... తనకు తాను నచ్చచెప్పుకున్నాడు. బైట చెట్టుకిందవున్న మలక మంచంలో వెల్లకిల పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు.

ఇంతలో ఆగిన ఆటోశబ్దానికి తలపైకెత్తి చూశాడు. లచ్చిమి ఆటో దిగటం చూచి నివ్వెరపోయాడు. వెంట సామానేం లేదు. మరైతే ఆటోలో ఎందుకు దిగబడినట్టు?

వచ్చి గుడిసెకేసిన తాళం తీస్తూ 'మనకు లక్కీఛాన్స్ దొరికింది.' అంది

'ఏందబ్బా అది!-' తనూ గుడిసెలోకి నడుస్తూ అడిగాడు.

ఎలా చెప్పాలాని లిప్తపాటు లక్ష్మి తటపటాయించింది.

'లక్కేంటి... తగలటమేంటి? పిచ్చిగాని ఎక్కిందా?' గుంజకు ఆనుకుని కూర్చుంటూ అన్నాడు.

'నువ్వొచ్చి ఎంత సేపైతంది?- నీకు పనేదైనా దొరికిందా?... అవునూ... మధ్యాహ్నం బువ్వేమైనా తిన్నావా?-' పరామర్శగా అడిగింది.

'అద్సరే.. నువ్వెక్కడికెళ్లొచ్చినట్టు?- మ్యాటనీషోకి వెళ్లిందానివి సిటీ బస్సులో రావచ్చుగా... బోలెడు డబ్బు ఖర్చుపెట్టి ఆటోలో దేనికి రావటం?-'

'ఓరి నా పిచ్చి మల్లేశూ! నీకో రహస్యం చెప్పాలి.... నువ్వు ఉదయాన్నే వీధిలోకెళ్లావా... అప్పుడేమో... మనకీ గుడిసె అద్దెకిచ్చిన బ్రోకరు లేడూ... సినీమాలో

వేషం ఇప్పిస్తే వేస్తావా?' అని అడిగేడు.

'ఆడేంటి నీకు సినిమాలో యాషం ఇప్పిస్తీనంటమేంటి?-' నివ్వెరపోయి ప్రశ్నించాడు.

'నేనూ అదే అనుకున్నాను. కానీ... కాస్సేపాగి అతనే చెప్పాడు తాను చిన్న చిన్న వేషాలిప్పించే బ్రోకరని!. అతని మాటల్లో నమ్మం కుది... ధైర్య చేసి బయల్దేరాను. నాకు మేకప్ చేయించాడు. డైరెక్టర్‌కి పరిచయం చేశాడు. అదొక పౌరాణిక సినిమా... నాదేమో రాణిగారి కుమార్తెకు చెలికత్తె వేషం! నాచేత డైలాగులు చెప్పించారు. అందంగ రాకుమారిలావున్నానని అంతా పొగిడారు నన్ను!. వేషం అయిపోయింది. అవసరపడినప్పుడు మళ్లా పిలుస్తామని రెండు వెయ్యిరూపాయల నోట్లు నా చేతిలో పెట్టారు. ఖర్చు వాళ్లే భరించి నన్ను ఆటోలో ఇంటికి పొపమ్మన్నారు...ఇదిగో డబ్బు 'జాకిట్లోంచి తీసిన రెండు వెయ్యి నోట్లు మల్లేశం చేతిలో వుంచింది.

'నువ్వు సెప్పేది నిజమా?-'

'నీమీదొట్టు... మళ్లీ ఎప్పుడైనా వచ్చి నన్ను వేషం కోసం రమ్మని పిలిస్తే... వెళ్లమంటావా?-' బేలగా అడిగింది లక్ష్మి.

'సర్లే... తరువాత వివరంగ ఆలోచిద్దాంగాని.. నువ్వు ముందు కుండతో వేన్నీళు పెట్టు. నీళ్లు పోసుకోవాలి... తిరిగి తిరిగి వళ్లంతా పులసరి కంపుకొడతావుంది...' చొక్కావిప్పుతూ చెప్పాడు.

పొయ్యి రాజేసే పనిలో నిమగ్నమైంది లక్ష్మి!

X X X

ఏడాది తిరిగేసరికి మల్లేశు వేషం మారింది! భాష మారింది! నడక మారింది! ఆలోచనా సరళి మారింది! నివాసం మారింది గుడిసెలోంచి సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్లోకి మారాడు!.

సినీమా వాళ్లతో సావాసం పెరిగింది. మంచి మంచి వేషాలు సినీమాల్లో వేస్తునే వుంది లక్ష్మి!. పాపులారిటీ పెరిగింది!

మల్లేశం చిన్న ఆర్టిస్ట్‌ల సప్లైయరయ్యాడు! తనకింద ఇప్పుడు మూడొందల మంది బతికేస్తున్నారు. మల్లేశు శానా మంచోడనే పేరు సంపాదించుకున్నాడు

ఇండస్ట్రీలో!

నగరానికొచ్చి మోసపోయిన ఆడపిల్లలు చాలామంది మల్లేశుని ఆశ్రయిస్తున్నారు. చిన్న ఆర్టిస్టులకు పెద్దదిక్కయ్యాడు. వాళ్లని ఆదరించి జీవనోపాధి కల్పిస్తున్నాడు.

మల్లేశు ఆదాయమూ వడివడిగ పెరుగుతోంది! ఇద్దరు బిడ్డల తండ్రి అయినాడు. వాళ్లని కాన్వెంట్లో చదివిస్తున్నాడు. తనకోసం కోటి రూపాయలతో సిటీ నడిబొడ్డున విల్లా కట్టాడు. కారుకు ఓనరైనాడు. విల్లా ముందు కాపలాకు సెక్యూరిటీ పెట్టుకున్నాడు.

సిటీకి రావటం మల్లేశానికి మంచి టర్నింగ్‌పాయింటైందని అనుకుంటూంటాడు. నత అదృష్టానికి ప్రేమించి పెళ్లాడిన లక్ష్మే ముఖ్య కారణమని మురిసిపోని క్షణం లేదు. లేకుంటే తానెక్కడో నేలబారు జీవితం గడపాల్సివచ్చేది!.

X X X

ఇరవయేళ్ల కాలంలో మల్లేశం ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయాడు. పలుకుబడి పరపతి మేరువైనయ్!

ఫిలిం ఇండస్ట్రీలో స్వంతగ సినిమాలు తీయగల స్థాయికి చేరాడు. అయినా తాను నిర్మాత కాదల్చుకోలేదు. సినీమాలు నిర్మించటంలో గల సాధక బాధకాలు కరతలామలకం చేసుకున్న వాడవటాన చెయ్యి కాల్చుకోతల్చుకోలేదు.

సిరిదావచ్చిన వచ్చును... అను పద్యంలోని సామెతలా తన జీవితం కావటానికి ఇష్టం లేదు. తానీ స్థితికి రావటం ఎన్నో ఏళ్ల కలలపంట!. అందుకే కష్టించి ఆర్జించిన డబ్బును చేజార్చుకోతల్చుకోలేదు.

పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు జూనిర్ ఆర్టిస్ట్స్ సప్లై కోసం తప్పనిసరిగా మల్లేశునే సంప్రదిస్తారు. అందుక్కారణం అతనిలోగల ప్రిన్స్‌పుల్స్!. మనిషి మంచి నమ్మకస్తుడు మాట అనడు... తాను పడడు.

వేషాల్లేని సమయాల్లో జూనియర్ ఆర్టిస్టులకు ఆర్థికసాయం చేసి వాళ్లను ఆదుకోవటం మల్లేశంలో గల గొప్పవిశేషం!

మల్లేశంది జాలిగుండె! అతనికున్నది దయా గుణం!. తాను ఎన్ని మెట్లెక్కి

ఇంతటి స్థాయి చేరుకున్నాడో మర్చిపోలేని వ్యక్తి! అందుకే జూనియర్ ఆర్టిస్టలంతా ఆయన్ను దేవుడుగా కొలుస్తారు. అతను ఎంత చెప్తే అంత ! అతని మాటకు తిరుగులేదు. ఎవ్వరూ ఎదురుచెప్పరు.

పిల్లలు ఎదిగేక లక్ష్మి సినిమాల్లో వేషాలు వేయటం మానుకుంది. భర్త... పిల్లల సంరక్షణకోసమే తన కాలాన్ని వెచ్చిస్తోంది.

XXX

'సార్ మల్లేశంగారూ... మిమ్మల్ని మా ఎస్సైగారు రమ్మంటున్నారు....' బంగళాలోకొచ్చిన ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్‌లో ఒకతను అన్నాడు.

ఆశ్చర్యపోతూ వారివంక చూచి 'నన్నా? ఎందుకు?' ఎదురు ప్రశ్న వేశాడు.

'ఏమోసార్... తెలియదు.! మరొకడు చెప్పాడు.

'నాకిప్పుడు అర్జంట్ పనిమీద బైటికి వెళ్లాల్సిన పనివుందే... సరేపదండి. వెళ్లే దోవలోనే కదా పోలీస్టేషను... ఎస్సైగారిని కలిసే వెడతాను... సోఫాలోంచి లేచి బయల్దేరాడు మల్లేశం.

స్టేషన్లోకొస్తున్న మల్లేశాన్ని చూస్తూ 'నువ్వీ మధ్య బిగ్‌షాట్‌వైపోయావ్...' ఎస్సై అన్నాడు.

'అదేం లేదుసార్. అంతా మీ అభిమానం...' ఎస్సై చెయ్యి చూపించగా ఎదురు ఛైర్లో కూర్చున్నాడు.

'ఒకసారి సెల్‌వైపు చూడు మల్లేశం. ఆ ఇద్దరు ఆడపిల్లలు నీకు తెలుసా?...' ఎస్సై అడిగాడు.

'అవును! మా పిల్లకాయలే!- నావద్ద పనిచేసే జూనియర్ ఆర్టిస్టే! కొత్తగా టీమ్‌లో చేరారు...'

'అలాగా... వీళ్లు లాడ్జిలో పట్టుబడ్డారు. బ్రోతల్ కేసుక్రింద ఇక్కడికి తేగానే... నీ పేరు చెప్పారు... అందుకే నిన్ను పిలిపించాను...'

ఎస్సై మాటలకు కంగుతిన్నాడు మల్లేశం ! తన ఇన్నేళ్ల అనుభవంలో ఇలాంటిది జరిగింది లేదు.

'కేసు బుక్‌చేసి కోర్టులో హాజరు పరిస్తే... ఫైన్‌వేసి వదిలేస్తారనుకో... అయినా

నువ్వు నాకు తెల్సు కనుక నీకోసం కబురుపెట్టాను...'

'ఎక్కడో ఏదో పొరపాటు జరిగివుంటుంది సార్. ఆ ఫైనేదో నే కడతాను. కేసు బుక్ చేయకండిసార్.... పాపం ఆడపిల్లలు అన్యాయమైపోతారు. కాస్త దయవుంచండి...' బ్రతిమాలాడు.

ఎస్సై తీవ్రంగ ఆలోచించి ఎదురుగ వున్న రైటర్‌తో వీళ్లని సెటిల్ చేసి పంపించమని హుకుం జారీ చేశాడు.

డబ్బు పదివేలు కట్టి ఇద్దరాడపిల్లలతో బైటికి నడిచి వారి చేతిలో చెరొక పదివేలు పెట్టి 'జాగ్రత్తగ ఇంటికెళ్లండి! మళ్లీ ఇలాంటి చెడ్డపన్లు చేసినా ఇజ్జత్ తీసేయకండి...' అని వాళ్లకు ఆటోలో ధైర్యం చెప్పి సాగనంపాడు.

మీరు మా పాలిట దేవుడు సార్... అని చెప్పి ఆడపిల్లల కళ్లల్లో నీరు తొణికిసలాడటం తాను చూశాడు. హృదయం ద్రవించింది.

ఈ సంఘటన తన జీవితంలో మరో కొత్త టర్నింగ్‌పాయింట్ కాబోలనుకుని కారెక్కాడు మల్లేశం!!

--- సమాప్తం ---